# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

APRIL - 1999

# సంక్షిప్త వార్తలు

1999 ఫిబ్రువరి 26,27,28 తేదీలలో కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఆవరణలో ఒరియా బైబిలు సెమినార్ ఘనంగా నిర్వహించబడెను. సత్యవాణి ఆఫీసునుండి ఒరియా భాషలో బైబిలు కరస్పాండెన్సు కోర్సు పూర్తిచేసిన వెయ్యిమంది ఈ సెమినార్‌కు ఆహ్వానించబడగా ఇంచుమించు నాలుగువందల మంది ఒరిస్సా రాష్ట్రమునుండి ఈ సెమినార్‌కు తమ స్వంత ఖర్చులతో హాజరైరి. ఈ సెమినార్‌కు ఫిబ్రువరి 25వ తేదీ గురువారం రాత్రినుండియే ఒరిస్సా రాష్ట్రము నుండి ప్రజలు కాకినాడ చేరుకొనుట మొదలిడిరి.

అమెరికా నుండి వచ్చిన సోదరులు ఐరా రైస్ గారు ముఖ్య ప్రసంగీకులు కాగా, ఒరిస్సాలో పనిచేయుచున్న క్రీస్తు సంఘ బోధకులు, స్థానిక బోధకులు వాక్యోపదేశంలో సహాయం చేసిరి. సోదరులు జాన్‌వెస్లీ, పి.చంద్రశేఖర్, గంటా ఫిలిప్, నోబుల్‌రాజు, సీసాస్‌దీప్, బెంజమిన్ నందా, జాషువా గూటం గార్లు చక్కని వాక్యపరిచర్య చేసిరి. ప్రతి ప్రసంగము ఆంగ్లము నుండి ఒరియాకు గాని తెలుగు నుండి ఒరియాకు గాని అనువదించబడేది. అనువాదం చేయుటలో సోదరులు బెంజమిన్‌నందా (బర్‌గర్), బి.జె.రావ్ (కటక్), ఫల్గుణీజేనా (గజపతినగర్), ప్రఫుల్ల (కటక్) గార్లు గొప్పగా సహకరించిరి.

ఒరియా సెమినార్ కొరకు ప్రత్యేకముగా తయారు చేయబడిన ఒరియా పాటలను నేర్పించి, నడిపించుటలో సోదరులు ఉబేదాలిమ్మా, ఉమ్మెద్‌లిమ్మాలు సహకరించిరి. సెమినార్ జరిగిన మూడు రోజులలోను చక్కటి ఆత్మీయ వాతావరణములో తెలుగు సోదరసోదరీలతో కలిసి ఒరిస్సా రాష్ట్రప్రజలు గొప్ప సహవాసమును పంచుకొనిరి. సోదరులు రైస్‌గారు, తదితరులు చక్కటి బైబిలు పాఠములను ఉపదేశించగా ఇరవైమంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఒరియా

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 63722

Editor :

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 19 ఏప్రియల్ 1999 సంచిక 9


## సంపాదకీయం

### ఆదిమ సంఘము యొక్క వర్తమానము : పునరుత్థానుడైన క్రీస్తు
### (The Message of the Early Church: The Resurrected Christ)

పరిచయము : ఏథెన్సు పట్టణములో యున్న వేదాంతులకు అపొ.పౌలు ఇట్లు చెప్పాడు: "ఎందుకనగా తాను (దేవుడు) నియమించిన మనుష్యుని చేత నీతిననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించి యున్నాడు. మృతులలో నుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసియున్నాడు" (అపొ.కా. 17:31). కొరింధు పట్టణములో యున్న క్రైస్తవులకు వ్రాస్తు, "క్రీస్తు లేపబడని యెడల మీ విశ్వాసము వ్యర్థమే, మీరింకను మీ పాపములలోనే యున్నారు" అని అతడు చెప్పెను (1కొరింధీ 15:17). ఈ రెండు సందర్భములలోను ఒకటి నిర్దేవులకు, రెండవది క్రైస్తవులకు చెప్పబడిన మాటలు ఈ పాఠమునకు ఆధారముగా తీసికొనబడినవి.

పునరుత్థానమును బట్టి క్రైస్తవ్యము నిజంగా నిలబడతాది, లేక కూలిపోతాది. పునరుత్థానము జరుగకపోతే క్రైస్తవ్యము యొక్క మూలాధారములన్నీ కూలిపోవును. అవి కూలిపోగా మిగిలేది యేమీ వుండదు. అపొ.పౌలు చెప్పినట్లు, "క్రీస్తు లేపబడియుండని యెడల మేము చేయు ప్రకటన వ్యర్థమే, మీ విశ్వాసమును వ్యర్థమే. దేవుడు క్రీస్తును లేపెనని ఆయనను గూర్చి మేము సాక్ష్యము చెప్పియున్నాము గదా ? మృతులు లేపబడని యెడల దేవుడాయనను లేపలేదు గనుక మేము దేవుని విషయమై అబద్ధపు సాక్షులముగా అగపడుచున్నాము" (1కొరింథీ 15:14-15).

బైబిలులో చెప్పబడిన అద్భుతములన్నిటికిని నమ్ముటకు గాను పునరుత్థానము పునాది వంటిది. క్రీస్తు మృతులలో నుండి లేచియున్న యెడల, ఆయన గ్రుడ్డివారికి చూపునియ్యడం, రోగులను స్వస్థపర్చడం, సముద్రమును శాంతిపర్చడం సునాయాసం ఈ బ్రహ్మాండమైన అద్భుతాన్ని బట్టి మిగతా అద్భుతములన్నీ వెంబడి వస్తాయి. అందువలననే అపొస్తలులు మిగతా అద్భుతములను నిరూపించుటకు వెచ్చించిన సమయం సూక్ష్మమని మనము గ్రహించుకోగలము. సరిగదా వారి సాక్ష్యాధారములు అద్భుతములకు అద్భుతమైన పునరుత్థానమునకు ఎక్కువయుండి, మిగతా అద్భుతములన్నిటిని దానిపైనే నిలబడునట్లు చేసారు. క్రొత్తనిబంధనలో వారు వ్రాసిన సువార్తలలో నాలుగోవంతు ఆయన మరణ సమాధి పునరుత్థానములను గూర్చియు, సిలువకు ముందు ఆయన గడిపిన ఆఖరి వారములో జరిగిన సంఘటనలను గూర్చియు కేటాయించబడింది.

## ఖాళీ చేయబడిన సమాధి

సిలువ మీద నుండి క్రిందికి తీయబడిన క్రీస్తుయొక్క మృత దేహమునకు ఏదో జరిగింది. అది అరిమతయి యోసేపు యొక్క సమాధిలో యుంచబడెనని, ఇరవైమంది కావలివారు అక్కడ యుంచబడిరని క్రొత్తనిబంధన సాక్ష్యమిచ్చు

చున్నది. అయితే ఆదివారం ఉదయమున ప్రతి విశ్వాసి, అవిశ్వాసి కూడా అంగీకరించు చున్నట్లుగా ఆ సమాధి ఖాళీ చేయబడెను. యేసు మరణించడం, ఆయన శరీరము యోసేపు యొక్క సమాధిలో యుంచబడడం ఎవరు కాదనరు. అయితే ఆయన శరీరము ఏమయ్యిందో అనుసరికి వివిధ కధనాలు వినబడ్డాయి. గనుక మానవ చరిత్రలో అతి ప్రాముఖ్యమైన సంఘటన పాలస్తీనాలో ఒక ఖాళీ సమాధిపై కేంద్రీకృతమైనది. ఏలయనగా మానవజాతి రక్షకుడనని చెప్పుకొనిన యేసుక్రీస్తు యొక్క శరీరము అందులో యుంచబడినది. జరిగిన దానిని ప్రదర్శించుట ద్వారా పునరుత్థానాన్ని నిరూపించలేము. ఏలయనగా అది ఏకైకమైనది. గాని చారిత్రాత్మక సంఘటన (పునరుత్థానము) యొక్క యదార్థతను చారిత్రాత్మక ఋజువులలో మనము కనుగొనగలము. బైబిలును (దేవుని వాక్యమని మనము నమ్ముచున్నను) చరిత్ర గ్రంథములలో నొకదానిగా పరిగణస్తూ ఈ సంఘటన యొక్క నిజానిజాలను తెలిసికొనుటకు గాను చారిత్రాత్మక ఋజువులను పరిశీలించుదాం. ఆ ఋజువులు యేమి సూచించుచున్నాయి ?

ముఖ్యాంశమును గమనించుము : యేసుయొక్క మృత దేహము ఏమయ్యేను ?

- దానిని శత్రువుల ఎత్తికొనిపోయిరా ?
- దానిని మిత్రులు ఎత్తికొనిపోయిరా ? లేక
- బైబిలు చెప్పుచున్నట్లుగా దేవుని శక్తివలన ఆయన మృతులలో నుండి తిరిగి లేచెనా ? (రోమా 1:7).

## క్రీస్తు శత్రువులు ఆయన శరీరమును ఎత్తికొనిపోయిరా ?

దానిని ఎత్తికొని పోడానికి వారికి సరియైన కారణములున్నాయా ? లేనేలేవు.

ఏలయనగా అది వారి వశములోనే యున్నది. సరిగదా అదెక్కడ యుంచబడిందో అక్కడే యుండులాగున వారు అన్ని జాగ్రత్తలు తీసికొన్నారు. (మత్తయి 27:62-66 చదువుము)

సమాధిలో నుంచిన శవమును ఎత్తికొనిపోతే ఐదు విధములుగా అది నేరం. దాని దండనం మరణశిక్షయే. ఆ ఐదు కారణాలు ఇట్లున్నాయి:

- ముద్రను భంగపరచినందుకు
- ముద్రను భంగపరచుటకు అవకాశమిచ్చినందుకు
- శవమును దొంగిలించినందుకు
- శవమును ఎత్తికొని పోవుటకు అవకాశం కల్పించినందుకు
- విధి నిర్వహణలో నిద్రపోయినందుకు.

అయితే కావలి వారిలో ఎవడును విధి నిర్వహణలో నిద్రపోయినందుకు నిర్బంధింపబడలేదు. తమ కావలిలో యుంచబడిన ఖైదీలు పారిపోయిన వారికి ఆ రోజులలో యేమి జరిగేదో తెలిసికొనుటకు అపొ.కా. 12:19 చదువుము.

అటు తరువాత వచ్చిన పెంతెకొస్తునాడు వారి ప్రవర్తనను బట్టి వారు క్రీస్తు శరీరమును ఎత్తికొనిపోలేదని ఋజువగుచున్నది. వారు ఎత్తికొనిపోయి యుంటే. ఆరోజు దానిని ప్రదర్శించియుండేవారు. సరిగదా వారెవరు అట్లు చేయక వారిలో మూడువేల మంది పునరుత్థానుడైన క్రీస్తును గూర్చి అపొస్తలుల సాక్ష్యమును నమ్మి బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 2:41).

5.

## ఆయన మిత్రులు శరీరమును ఎత్తికొనిపోయిరా ?

ఈ సందర్భములో కావలివారిచ్చిన సాక్ష్యము కేవలం అబద్ధము (మత్తయి 28:11-15 చదువుము). ఆ శరీరము ఏమయ్యింది ? అని అడుగగా, అది దొంగిలించబడినదని వారన్నారు. అయితే మీరేమి చేయుచున్నారని అడుగగా, వారు కాదు గాని యూదుల యాజకులు పెద్దలు, నిద్రపోవుచున్నారని సలహా యిచ్చారు. అయితే క్రీస్తు శరీరమును ఎత్తికొని పోయినందుకు శిష్యులలో ఎవడును నిర్బంధింపబడలేదు.

శిష్యులు క్రీస్తు శరీరమును ఎత్తికొనిపోవలసిన కారణం వారికేమియు లేదు. ఏలయనగా ఆయన మృతులలోనుండి లేచునని వారెన్నడు భావించలేదు (యోహాను 20:11-13; లూకా 24:10-24; మార్కు 16:9-13; యోహాను 20:24-25).

ఒకవేళ యేసు శిష్యులే ఆయన శరీరమును ఎత్తికొని పోవుటకు ప్రయత్నించిన యెడల, అదివారికి అసంభవము. యెరూషలేము యొక్క జనాభా ఆరోజుల్లో రెండున్నర లక్షలు. పస్కా పండుగ సందర్భములో అది 30 లక్షల వరకు పెరిగేది. చిన్న ప్రాంతములో గుమిగూడే పెద్ద ప్రజాసంఖ్య యిది. ఇంతమందిలో ఒక మృతదేహాన్ని ఎవరికీ కనబడకుండా దాచిపెట్టడం అసాధ్యం.

శిష్యులందరు తాము పిరికి వారమని యిదివరకే ప్రదర్శించి యున్నారు (మత్తయి 26:56,58).

## పునరుత్థానమును గూర్చి అవిశ్వాసులు చెప్పే సిద్ధాంతాలు

మూర్ఛబోయిన సిద్ధాంతము (Swoon Theory) : దీని ప్రకారము క్రీస్తు నిజముగా చనిపోలేదు, గాని చనిపోయినట్లు కనబడ్డాడు. సమాధిలో ఉంచబడిన

తరువాత ఆయన తెప్పరిల్లి, రాతిని పొర్లించుకొని బయటకు వచ్చేసాడు! యిది అసాధ్యము!!! ఆయన సమాధి చేయబడక ముందు ఖచ్చితముగా చనిపోయినట్లు ఋజువు లున్నాయి. ఆయన బలహీనుడయ్యాడు, ప్రక్కలో బల్లెము పొడువబడింది. ఆయన అప్పటికే చనిపోయి యుండుట వలన సైనికులు ఆయన కాళ్లు విరుగగొట్ట నవసరం లేదని చెప్పుకొన్నారు (యోహాను 19:31-37).

ఆయన నిజంగా సమాధిపై యుంచిన రాతిని పొర్లించగలిగాడా ? బయటకు వచ్చి కావలి వారికి కనబడకుండా పోయాడా ? ఆ తరువాత ఆయన ఏమయ్యాడు? ఆయన అనుచరులు శ్రమిస్తూ, హింసించబడుచూ, చంపబడుచూ యుంటే ఆయన రహస్యంగా దాగుకొని యున్నాడా ? సిలువలో ఆయన చనిపోవకపోతే, మరెప్పుడు చనిపోయాడు ?

దర్శన సిద్ధాంతము (Vision Theory ) : ఈ సిద్ధాంత ప్రకారము క్రీస్తు తన అనుచరులకు కనబడెను గాని ఆయన దర్శనములలోనే కనబడెను. అయితే నమ్మకంలేని శిష్యులు ఈ దర్శనముల యందు విశ్వాసముంచగలిగారా ? అంతే గాకుండా ఇదే ఒక అద్భుతమగును. గాని క్రీస్తు ఒక వంచకుడుగా అగుపడును (లూకా 24:39 చూడుము). యిది అలాగుంచి, ఆయన శరీరమున కేమయ్యెను? ఈ సిద్ధాంతము అట్టి వివరణములనేమీ యిచ్చుటకు ప్రయత్నించ లేదు; అది ఉన్నా వాస్తవములను, సమస్యలను విస్మరించినది.

యోసేపు సిద్ధాంతము (Joseph Theory ) : ఈ సిద్ధాంత ప్రకారము ఆ సమాధి యజమాని యగు అరిమతయి యోసేపు తన మనస్సు మార్చుకొని దానిలో ఉంచబడిన శరీరమును బయటికి తీయించేసాడు! అయితే ఆ శరీరాన్ని యోసేపు మాత్రము తొలగించడానికి ఎందుకు సంకల్పించాలి ? యేసు యొక్క శరీరాన్ని అందులో యుంచడానికి తన సమాధిని తానే స్వయంగా యిచ్చాడు. అంతేకాదు తన ప్రాణాలను కోల్పోవుటకు సయితము అతడు తెగించాడు.

అట్లయినప్పుడు యోసేపు ఆ శరీరాన్ని తీసికొని బయట ఇంకెక్కడో ఎందుకు దాచిపెడతాడు ? అంతే గాకుండా సమాధి దగ్గరనున్న కాపలాదారులు ఎందు కున్నట్టు ? వారేమైనట్టు ? ఈ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి జోసెఫ్ క్లూజ్‌నర్ ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేక పోయాడు. తనకేదో గొప్ప పేరు వచ్చేస్తాదనే ఉద్దేశ్యం దీని వెనుక అతనికి యుండవచ్చును.

శిష్యులందరూ కలసి అబద్ధమాడారని, పునరుత్థానమును గూర్చిన కధనము నిజంగా చాలాకాలము తరువాతనే ప్రబలిందనీ మొదలగు కధనములు అనేకములున్నాయి. అయితే అవన్నీ కట్టుకధలే. పునరుత్థానము గనుక ఒక కట్టుకధ అయితే శిష్యులందరూ తమ ప్రాణాలను సయితము కోల్పోవుటకు ఎందుకు సిద్ధపడ్డారు ? పెంతెకొస్తునాడు మూడువేల మంది ఎందుకు నమ్మి బాప్తిస్మము పొందారు ? సౌలు పౌలుగా ఎందుకు మార్పుజెందాడు ?

## క్రీస్తు పునరుత్థానము యొక్క సాక్షాత్ ఋజువులు :

- పునరుత్థానుడైన తరువాత క్రీస్తు 10 లేక 11 మారులు సాక్షులకు ప్రత్యక్షమాయెను (కొరింధీ 15:4-8).
- సమాధి దగ్గరకు వెళ్లిన స్త్రీలకు (మత్తయి 28:1).
- కూడియున్న 11 మంది శిష్యులకు (మార్కు 16:14).
- పదిమంది శిష్యులకు (యోహాను 20:19-24).
- గలిలయలో 11మంది శిష్యులకు (మత్తయి 28:16-17).
- తిబెరియ సముద్రము దగ్గర ఏడుగురు శిష్యులకు (యోహాను 21:1-2).
- ఎమ్మాయి మార్గమున ఇద్దరు శిష్యులకు (లూకా 24:13-15).

- 500 మంది శిష్యులకు (1కొరింథీ 15:6).

40 దినములైన తరువాత ఆయన ప్రత్యక్షతలు ఆగిపోయెను. కట్టుకధలలో అయితే దినములు గడచుకొలదీ యివి ఎక్కువగును.

యేసుప్రభువు పునరుత్థానుడైన తరువాత శిష్యుల జీవితములో గొప్ప మార్పు సంభవించెను. క్రీస్తు పునరుత్థానములో యున్న గొప్ప విశేషమేమంటే :

1. దానిని గూర్చి మొదట ఆయన శత్రువులే ప్రచురము చేసారు.

2. అది జరిగిన మొదటి దినం నుండి జనులు విశ్వసించారు.

3. అది ఏ పట్టణములో జరిగెనో అదే పట్టణములో ప్రకటింపబడెను.

ఈనాడు జరుగుచున్నట్లు చెప్పబడుచున్న అద్భుతములను పరిశీలించుము. వాటిని పునరుత్థానముతో పోల్చిచూడుము. ఆధునిక అద్భుతములన్నీ నకిలీవే. అవి పుట్టిన స్థావరములు కూడ నకిలీవే.

## ముగింపు

ఖాళీ సమాధి యిట్లు ఘోషించుచున్నది :

- విజ్ఞానమునకు, వేదాంతమునకు దీనిని వివరించమనుచున్నది.
- చరిత్రకు ఈ సంఘటనను పునరావృతం చేయమనుచున్నది.
- కాలానికి దీనిని తుడిచివేయమనుచున్నది.
- విశ్వాసానికి దీనిని అంగీకరించమనుచున్నది.

క్రీస్తు పునరుత్థానము యొక్క సాక్ష్యాధారములు కోకొల్లలు. జూలియస్ సీజర్ ఒకప్పుడు రోమా చక్రవర్తి అయ్యాడని, అలెగ్జాండరు ఒకప్పుడు ప్రపంచాన్ని జయించాడని చెప్పు ఋజువుల కంటే క్రీస్తు పునరుత్థానుడయ్యాడని చెప్పే ఋజువులెక్కువ ఉన్నాయి. ఆయన అనుచరులు దానిని విశ్వసించారు. ఆ విశ్వాసాన్ని కాపాడు కొనుటకు గాను తమ ప్రాణములను సయితము కోల్పోయారు. అనేకులు తమ విశ్వాసము మంచిదైనను సరే, చెడ్డదైనను సరే దానికొరకు ప్రాణములనర్పిస్తారు. అయితే వారొక అబద్ధాన్ని ప్రచురము చేయుచున్నారని తెలిసికూడా దానికొరకు ప్రాణముల నర్పించేవారు ఎవరు ఈ లోకంలో యుండరు. నిజానికి అనేక శతాబ్దముల వరకు పునరుత్థానమును శంకించిన వాడెవడును లేడు. దానిని గూర్చిన ఋజువులు బలమైనవి. అసంఖ్యాకమైనవి. ఈ గొప్ప సత్యమును బట్టి ఆదిమ క్రైస్తవులు సువార్తవలన లోకమును తలక్రిందులుగా చేయగల్గిరి.

- జాషువా గూటం.

## బోధకుని యొక్క ప్రాముఖ్యత

### (The Importance of the Preacher)

(గత సంచిక తరువాయి)

**6. బోధకుని జీతము :** "పనివాడు జీతమునకు పాత్రుడు" అని బైబిలు బోధించుచున్నది (లూకా 10:7). "ఆలాగున సువార్త ప్రచురించువారు సువార్త వలన జీవింపవలెనని ప్రభువు నియమించియున్నాడు" అని పౌలు ప్రకటించెను (1కొరింథీ 9:14).

అయితే సువార్తికునికి ఆర్థికసహాయు మెట్లు దొరుకును ? మొదటిగా, అతడు తనకుగా తానే సంపాదించుకొన గలవాడై యుండవలసి వచ్చును. పౌలు కొంతకాలము అట్లే సువార్త బోధించెను (అపొ.కా. 18:1-3; 1కొరింథీ 4:12).

రెండవది-సంఘము బోధకునికి జీతము నిచ్చుటకు ఇష్టపడి, జీతము ఇయ్యగలిగిన స్థితిలో యున్న యెడల అతడు సంఘము నుండి ఆర్థిక సహాయము పొంద వచ్చును. సంఘములో లేనిది సంఘము ఇయ్యలేదు. సరిగదా సంఘము అందరికీ ఆర్థిక సహాయము చేయలేదు. వేరే పనులు చేయుట ద్వారా సంఘస్థులు ధనార్జన చేసి, అందులో కొంత భాగమును సంఘమున కియ్యవలెను (1కొరింధీ 16:2; 2కొరింధీ 9:7). అట్లు చేయుటలో సంఘమందు అర్హత గలవానిని బోధకునిగా ఎంచుకొని సంఘము అతనికి జీతము నీయగలదు.

7. రకరకాల బోధకులు : కనీసము **4** రకములైన బోధకులు నేడున్నారు. వారందిరిని, మంచివారిని చెడ్డవారిని గూర్చి ఇప్పుడు మనము తెలిసికొందము.

(a) సువార్త బోధకులు : ప్రపంచమందంతటా నమ్మకమైన ప్రతిష్టించు కొనిన క్రీస్తు సువార్త బోధకులున్నారు. వారు సంఘమునుండి ఆర్థిక సహాయము పొందుచుండ వచ్చును లేదా ఏదో ఒక ఉద్యోగము చేస్తూ యుండవచ్చును. అయితే తమ పొరుగువారిని రక్షణలోనికి తెచ్చుట వారి మొదటి పనియై యున్నది. వారు తమ బాధ్యతను సంపూర్ణముగా ఎరిగిన వారు గనుకను, అబద్ధ బోధలద్వారా ప్రజలను పెడత్రోవను పెట్టుటలో గల, ప్రమాదమును తత్ఫలితమును బాగుగా ఎరిగినవారు గనుక వారు దేవుని వాక్యమును విడువక పఠించువారు. వారి వ్యక్తిగత పరిస్థితులు, ప్రమాదములు ఎట్లున్నను వారు మాత్రము బోధించువారై యుందురు. మరణమునైనను సహింతురు గాని వారు మాత్రము తమ పనిని విడువరు. ఇట్లుండని వాడెవడైనను తాను సువార్త బోధకుడనిపించుకొనుటకు తగడు.

(b) మతశాఖల బోధకులు : బోధకులలో ఎక్కువ మంది మతశాఖల వారు. అంటే వారు ఏదో ఒక డినామినేషన్‌కు చెంది, ఆ శాఖయొక్క సంఘములో బోధింతురు. ఇట్టివారు మోసగించబడినవారు. మరియు వారు మానవకల్పిత సిద్ధాంతములను బోధింతురు. వారు బైబిలును కొంత బోధింతురు గాని బైబిలు

నంతటిని బోధింపరు. బైబిలునంతటిని బోధించిన యెడల వారొక డినామినేషన్‌లో యుండి మానవ కల్పిత సిద్ధాంతములను బోధింపరు. అనేకులు బైబిలు తమకు తామే యెరుగరు గనుక వారి దరపునే యుందురు. అట్టి బోధకులను గూర్చి పౌలు ఇట్లు పలికెను: "ఇది ఆశ్చర్యము కాదు; సాతాను తానే వెలుగదూత వేషము ధరించుకొనుచున్నాడు. గనుక వాని పరిచారకులును నీతి పరిచారకుల వేషము ధరించుకొనుట గొప్ప సంగతి కాదు. వారి క్రియల చొప్పున వారికంతము కలుగును" (2కొరింథీ 11:14,15). అతడు మరల ఇట్లనెను: "సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను ఆటంకములను కలుగజేయువారిని కనిపెట్టి యుండుడని మిమ్మును బతిమాలు కొనుచున్నాను. వారిలో నుండి తొలగిపోవుడి. అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు; వారు ఇంపైన మాటల వలనను ఇచ్చకముల వలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు" (రోమా 16:17,18). "వారు మానవులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు నన్ను వ్యర్థముగా ఆరాధించుదురు" (మార్కు 7:7) అని యేసు చెప్పెను.

(c) **స్వతంత్ర బోధకులు:** వీరు తమ యిష్టము వచ్చిన దానిని బోధించు నిమిత్తము డినామినేషన్ల నుండి విడిపోయిన బోధకులు. కొన్ని సందర్భములలో వారు అధికారమునంతటిని, యాజమాన్యమునంతటిని తమ పనియందు కలిగి యుండు నిమిత్తము వేరైపోయినట్లు మనము కనుగొనగలము. మరికొన్ని సందర్భములలో బైబలును మాత్రమే బోధించు నిమిత్తము వారు డినామినేషన్ల నుండి విడిపోయి ఉండవచ్చును. అయితే స్వతంత్ర బోధకులను గూర్చి బైబిలు ఎక్కడను బోధించుట లేదు. ఉదాహరణకు, పౌలు, పేతురు మరికొందరు బోధకులు ఒకరినుండి మరొకరు స్వతంత్రులు కాదు; మరియు వారు ప్రభువు నుండియు ఆయన సంఘము నుండియు స్వతంత్రత కలిగి పనిచేయుచున్న వారు అంతకు ముందే కాదు (హెబ్రీ 12:2; అపొ.కా. 2:1; 1కొరింథీ 14:8, 1:10).

(d) జీతగాండ్రయిన బోధకులు : మతశాఖల బోధకులు, స్వతంత్ర బోధకులలో పెక్కుమంది కేవలము జీతగాండ్రయిన బోధకులు, కొంతమంది తమ జీవనోపాధి కొరకు కర్మాగారములలో ఎట్లు పనిచేయుదురో వారు కూడ తమ జీవనోపాధి కొరకు బోధింతురు. వారు నిష్కల్మషులు కాదు; వారికి ప్రగాఢ నమ్మకము ఏమియును లేదు. వారికి జీతము ఇచ్చిన యెడల ఏ గుంపుకైనను బోధింతురు. జీతగాండ్ర లిస్టులో చేరు నిమిత్తము వారు బాప్తిస్మము పొందుదురు, మరింకేమైనను చేయుదురు. వారు ఈ నేలపై నున్న మురికివంటి వారు. వారికి ప్రభువును గూర్చి ఆయన సంఘమును గూర్చి నిజమైన ప్రేమలేదు. వారు తమ స్వప్రయోజనములకై మతమును వినియోగించు భిక్షగాండ్రు మాత్రమే. ఇట్టివారు సత్యమునందాసక్తిని వెలిబుచ్చుచు, మార్పుజెందిన వారివలె నటించి జీతము నడుగుదురు. వారిలో కొంతమంది మార్పు జెందినట్టు కూడ నటించరు. తిన్నగా వచ్చి జీతము నడుగుదురు. ఇట్టి వారిని గూర్చి యేసు ఇట్లు పలికెను: "జీతగాడు గొర్రెలకాపరి కాడు గనుక గొర్రెలు తనవి కానందున తోడేలు వచ్చుట చూచి గొర్రెలను విడిచి పెట్టి పారిపోవును; తోడేలు ఆ గొర్రెలను పట్టి చెదరగొట్టును. జీతగాడు జీతగాడే గనుక గొర్రెలను గూర్చి లక్ష్యము చేయక పారిపోవును" (యోహాను 10:12,13). ప్రభువుకు సంపూర్ణ సువార్తికులుగా ( ) పనిచేయవలెనని ఆశ యున్నట్లు చెప్పుకొనువారు వీరే. అంటే వారికి సంతృప్తియైన తరువాత ఏ పనియు చేయక సోమరులై యుండుటయే వారి ఉద్దేశము. ఒక్కోసారి వారు ఒక ప్రాంతమునుండి మరియొక ప్రాంతమునకు వెళ్ళి ప్రజలనుండి అడుక్కొని తిందురు. మరికొంతమంది పుస్తకములను అమ్ముచుందురు. వారు కేవలము భిక్షగాండ్రు మాత్రమే గనుక వారంటే ప్రజలకు గౌరవము లేదు సరిగదా వారిని అసహ్యించు కొందురు.

ఈ ఆఖరి తరగతులలో యున్న బోధకులు దేవుని వారుకారు. ఒకడు భక్తి కలిగినట్లు నటించును. బోధకుడని చెప్పుకొనినంత కాలము అట్టివాడు

దైవజనుడేయని అనేకులు అనుకొందురు. అయితే యిది సత్యము కానేకాదు. నేనే క్రీస్తునని చెప్పుకొను వారనేకులు వచ్చెదరు గాని అట్టివారిని నమ్మరాదని క్రీస్తు తన శిష్యులను హెచ్చరించెను (లూకా 21:8). అట్లే ఈనాడు కూడ అనేకులు తాము దేవుని వారమని, దేవుని వాక్యమును బోధింతుమని, అద్భుతములు చేయుదుమని చెప్పుకొనువారున్నారు. వారిని మనము పరిశోధింపవలెను, దేవుని వాక్యమును బట్టి పరీక్షించవలెను. అట్లు చేసి వారు సత్యమును బోధించుచున్నారో లేదో కనుగొనవలెను. "ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్ళియున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక ఆయాత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి" యని యోహాను పలికెను (1యోహాను 4:1).

బోధకుడెవడైనను సరే దేవుని వాక్యమునకు ముందు బోధకుని మాటనంగీకరింపకుము. అతడు దేవుని నిజ బోధకుడైన యెడల అతడు దైవ [illegible]లనే పలుకును (1పేతురు 4:11). సరిగదా అతడు బోధించు దానిని నీవు బైబిలు[illegible]తో సరిపోల్చుచున్నప్పుడు ఏమియు బాధపడడు. అయితే మనుష్యులు వచ్చి నిన్ను మోసగించి, పెడత్రోవను పెట్టి, నాశనమునకు నడిపించకుండునట్లు వారిని గూర్చి నీవు జాగ్రత్త పడుము.

**7. నేడు మనకు అవుసరమై యున్న బోధకులు :** అపొస్తలుల కాలము నుండియు క్రీస్తుసంఘము ఉన్నను (అపొ.కా. 2; దానియేలు 2:44). భారతదేశములో అది కొద్ది సంవత్సరములనుండియే ఉన్నది. మొదట్లో సువార్త ఇక్కడ బోధింపబడెను (కొలస్స 1:23). గనుక ఆదిలో క్రీస్తు సంఘము ఇక్కడ ఉండెను గాని కాలము గడచిన కొలది అది సత్యమునుండి కొట్టుకొని పోయెను. అదంతయు ఏమైనను సరేగాని, క్రీస్తుసంఘము ఈనాడు ఇక్కడ యున్నది (లూకా 8:11). భారతదేశములో అనేక ప్రాంతములలో దానిని మనము కనుగొనగలము. గత 35 సంవత్సరములలోను లక్షలాది ప్రజలు ఎక్కువగా దక్షిణ ఇండియాలో క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఇది చాల గొప్ప సంగతి. గాని ఉన్న పని

యంతటిలోను ఇది బహు స్వల్పము మాత్రమే.

భారతదేశములో ప్రతివ్యక్తికి సువార్త బోధింపబడవలెనని మాకోరిక. బైబిళ్ళు, కరస్పాండెన్సు కోర్సులు, సువార్త పత్రికులు, మేగజైనులు భారతదేశపు నలుమూలలా వ్యాపించాలని మా అభిలాష. లక్షలకొలది లేక కోట్లకొలది ఆత్మలు రక్షింపబడాలని వందలకొలది స్థానిక క్రీస్తుసంఘములు నెలకొల్పబడాలని మాయాశ. అయితే ఇదంతయు ఎట్లు సాధ్యమగును ?

సహజముగా మనకు పనివారమవుసరము. అయితే అనేకమంది పనివారిని ఏర్పరచుకొనుటకుగాను మావద్ద ధనము లేదు. ఒకవేళ ధనమున్నను జీతగాండ్ర సమూహము నేర్పరచుకొనుట మా యుద్దేశము కాదు. అయితే మనమేమి చేయ వలెను ? సువార్త వ్యాపింపజేయుటకు గాను మనము సంఘసభ్యులపై ఆధారపడ వలెను. ప్రభువును ఆయన సత్యమును ప్రేమించి దానికి విధేయులై వారికి సమయము దొరకినప్పుడెల్లా సువార్తను బోధించి ఉపదేశించు వారిని కనుగొనుటకు మేము ఆసక్తి కలిగియున్నాము. ప్రజలు తమ ఉద్యోగములను వీడి సువార్త కొరకు తమ సంపూర్ణ సమయమును వెచ్చించవలెనని మేము ప్రోత్సహించుట లేదు. సరిగదా మీ ఉద్యోగమును మీరు చేసిక్కొనుచూ, మీ జీవనోపాధిని సంపాదిస్తు మీ ఖాళీ సమయములోను, సెలవు దినములలోను వెళ్ళి సువార్త బోధింపవలసి నదిగా మిమ్ముమ్మను ప్రోత్సహించుచున్నాము. నీవు నిజముగా ప్రభువును ప్రేమించి, ఆయన వాక్యమును వ్యాపించజేయ గోరుచున్న యెడల నీవు తప్పక ఆ పనిని చేయగలవు. అంతేగాక, అట్లు చేయుటకు అనేక తరుణములను నీవు కనుగొందువు.

సత్యమును పఠించి ఇతరులకు ప్రకటించుమని నిన్ను మేము ప్రోత్సహించు చున్నాము. సువార్త పత్రికలు, మాస పత్రికలు పంచిపెట్టుటలో నీవు సహాయపడ వచ్చును. నిజానికి ఇట్టి విధమైన సహాయం కొరకు మేము కనిపెట్టుచున్నాము.

ప్రభువుకు సంపూర్ణ సమయాన్ని సమర్పించి పనిచేయవలెనని చెప్పుకొనువారు నిజముగా ప్రభువుకు సేవ చేయుటను గాక జీతమునే ఆశించుచున్నారు.

నీవు క్రైస్తవుడవై యుండి నీ స్నేహితుల మధ్య మంచి పేరును కలిగినవాడై యుండగలవు. నీవు ప్రతి ఆదివారము ఆరాధనకు హాజరగుచు అందు పాల్గొన గలవు. నీవు ఎంతమట్టుకైతే ప్రభువును సేవించాలని అనుకొనుచున్నావో అంత మట్టుకు సేవించగలవు.

**9. బోధకుల బిరుదులు :** బైబిలునందు కనబడని అనేక బిరుదులను, పేరులను ఈనాటి బోధకులు ధరించుకొనుచున్నారు. అందువలన అవిదోషములు మరియు పాపము కూడాను. రెవరెండ్, డాక్టర్, ఫాదర్, పాస్టర్, ప్రీస్ట్, బిషప్ అనునవి వారు ధరించుకొను కొన్ని బిరుదులు. "మీరైతే బోధకులని పిలువబడవద్దు, ఒక్కడే మీ బోధకుడు, మీరందరు సహోదరులు. మరియు భూమిమీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి; ఆయన పరలోకమందున్నాడు. మరియు మీరు గురువులని పిలువబడవద్దు; క్రీస్తు ఒక్కడే మీ గురువు" అని యేసు బోధించెను (మత్తయి 23:8-10). దేవుని గూర్చి చెప్పుచు దావీదు, "ఆయన నామము పరిశుద్ధమైనది, పూజింపతగినది" యని వ్రాసెను. (Holy and reverend is His name) (కీర్తన 111:9). పాస్టర్, బిషప్ అనునవి ఒకే పదవిని సూచించుచున్నవి (1తిమోతి3; తీతు1). కాని లేఖనములలో ఒక సంఘములో ఒకే పాస్టర్ గాని బిషప్ గాని గాక ఇద్దరు లేక, అంతకంటే ఎక్కువమంది యున్నట్లు కనుగొనగలము. వారినే సంఘములో పెద్దలు అని కూడ యందురు. మానవులకు అధికారము, ఘనత, మహిమలు అంటే ఎంతో ప్రీతి. వారికి వారే మానవ కల్పిత బిరుదులు, నామములు కూడ గట్టుకొందురు. అయితే సత్య సువార్త బోధకుడు వాటిని ధరించడు. ఏలయనగా లేఖనములు వాటిని ఖండించుచున్నవి. ఒక బోధకునికి లేఖనములు ఏ నామముల నిచ్చెనో వాటిని బట్టియే అతడు

సంబోధింపబడవలెను. బైబిలు మనలనేమని పిలుచుచున్నదో అట్లే పిలిపించు కొనుటలో సంతృప్తి కలిగి యుందము.

**10. బోధకుని దుస్తులు :** అనేక డినామినేషన్ల బోధకులు కేథలిక్కు స్వాములు గౌనులను ధరింతురు. వారు మిగిలిన వారందరికంటె ప్రత్యేకమైన వారుగ అందువలన కనబడుదురు. వారి దుస్తులవలన వారు బోధకులని, మత నాయకులని గుర్తగును. వారు ధరించిన దుస్తులవలన మాత్రమే వారెవరో తెలియ జేయబడుట ఎంత విచారకరమో! ప్రత్యేక ఆకర్షణను ప్రేమించి దానికొరకు గౌను అట్టి దుస్తులను ధరించుకొనుట ఎంత విచారకరమైన సంగతి. యేసు దానినెంత అసహ్యించుకొనెనో. నిజ క్రైస్తవులందరు వాటిని అసహ్యించుకొందురు. ఏలయనగా అవి హేయమైనవి. ఆనాటి కాలపు ప్రజలను గూర్చి యేసు ఇట్లు హెచ్చరించెను: "శాస్త్రులును గూర్చి జాగ్రత్త పడుడి. వారు నిలువుటంగీలు ధరించుకొని తిరుగ గోరుచు సంతవీధులలోవందనములను, సమాజమందిరములలో అగ్రపీఠములను, విందులలో అగ్రస్థానములను కోరుదురు. వారు విధవరాండ్ర యిండ్లను దిగమ్రింగుచు మాయవేషముగా దీర్ఘ ప్రార్ధనలను చేయుదురు. వారు మరి విశేషముగా శిక్ష పొందుదురు" (లూకా 20:45-47). నీవు దీనిని విన్నావా ? నేడున్న పరిస్థితినే యిది వివరించుట లేదా ? సువార్తను బోధించువారమైన మనము, మనకే ప్రత్యేకమైన ఆకర్షణ లభించునట్లు అట్టి దుస్తులను ధరించుకొనరాదు. మన సత్క్రియలును బట్టి మనము ఎరుగబడవలెను (1థెస్స 5:13).

## ముగింపు

బోధకుడు గొప్ప బాధ్యత కలిగినవాడు. అతడు దేవుని వాక్యముతో పనిచేయు చున్నాడు గనుక దానికి కలుపకూడదు, దానినుండి తీసివేయకూడదు (ప్రకటన 22:18, 19). వినువారి హృదయములలో విశ్వాసము వెలకొల్పబడగల్గు నట్లు అతడు దేవుని వాక్యమునే బోధించవలెను (రోమా 10:17). ఇది చాల

తీవ్రమైనది ఏలయనగా అతడు అసత్యమును బోధించిన యెడల, అసత్యముతో విశ్వాసమేర్పడును. అయితే అతడు పవిత్రమైన సత్యమునే బోధించిన యెడల దానియందే విశ్వాసమేర్పడును.

లోకమందున్న వాటన్నిటికంటె సువార్తను బోధించుట గొప్ప పనియై యున్నది. అందువలన దానిని తేలికగాను, గౌరవహీనముగాను ఎంచరాదు. పౌలు ఇట్లు వ్రాసెను: "ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింప బడును. వారు విశ్వసింపని వానికి ఎట్లు ప్రార్థన చేయుదురు ? విననివానిని ఎట్లు విశ్వసించుదురు ? ప్రకటించువాడు లేకుండ వారెట్లు విందురు ? ప్రకటించు వారు పంపబడని యెడల ఎట్లు ప్రకటించుదురు ? ఇందు విషయమై ఉత్తమమైన వాటిని గూర్చిన సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి అని వ్రాయబడి యున్నది" (రోమా 10:13-15). "సిలువను గూర్చిన వార్త నశించుచున్న వారికి వెర్రితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి" యని అతడు మరల వ్రాసెను (1కొరింథీ 1:18).

**చివరి మాట :** ప్రభువునకు లోబడువారు క్రీస్తు సువార్తను బోధించి ఉపదేశించుటకు సిద్ధపడవలెనని వారి విషయమై మేము ఆశించుచున్నామని దయచేసి గ్రహించుము. అయితే నీకు జీతము ఇయ్యవలసినదని మాకు వ్రాయ వద్దు. అందు విషయమై మా వద్దకు రావద్దు. జీతగాండ్రకు పని కల్పించే వ్యాపారములో మేము లేము. క్రీస్తుసంఘము పెరిగి, అభివృద్ధి జెంది, భారతదేశమంతయు వ్యాపించిన యెడల ప్రతి స్థానిక సంఘము తన పనిని అదే తప్పక కొనసాగించ గలుగును. తమ సభ్యులు ధారాళముగా యిచ్చినందు వలన వారికి సరిపడినంత ధనమున్న యెడల, అర్హత గలవాని నొకని వారిలో వారు ఎంచుకొని, అతడు ప్రభువు పని నిమిత్తము తన సమయమును వెచ్చించులాగున తమ సామర్థ్యము కొలది వానికీయవచ్చును. ప్రతిస్థానిక సంఘము తమ బోధకుని

అవుసరతలను వారే అట్లు తీర్చగల్గుదురు. గనుక ఒక ఉద్యోగము కావలెనని దయచేసి మీరు మాకు వ్రాయవద్దు. అట్లు చేసి మీ సమయమును మా సమయమును పాడుచేయవద్దు. ఎప్పుడైనను ఎన్నడైనను ఒక మనుష్యునికి జీతము నిచ్చుట జరిగిన యెడల ఆ పని స్థానిక సంఘసభ్యులదే అయ్యుండును.

నీ విద్యను స్థానికముగా సంపాదించుకొని, దేవుని చిత్తము నెరుగుటకు బైబిలును, బైబిలు కరస్పాండెన్సు కోర్సును పఠించుమని నీకు సలహా నిచ్చు చున్నాము.

అట్లు చివరిగా నీవు ప్రభువు పని చేయాలని కోరుచున్న యెడల తప్పకుండా చేయుము. క్రైస్తవుడగుటకు సువార్తకు విధేయుడవు కమ్ము. నీ పనిని నీవు చేసికొనుచు నీకు తరుణము దొరికినప్పుడెల్లా నీ మిత్రుల మధ్య సువార్తను బోధించుము. నీ ప్రాంతములో సువార్త పత్రికలు పంచిపెట్టుము. బైబిలు కరస్పాండెన్సు కోర్సులో నీ మిత్రులను చేర్చుము. నీ ఊరిలో క్రీస్తుసంఘము లేనియెడల అది అక్కడ నెలకొల్పి కష్టపడి పనిచేయుము. నీవు నిజముగా పనిచేయ వలెనని కోరుచున్న యెడల, ప్రభువును, మనుష్యుల ఆత్మలను నీవు నిజముగా ప్రేమించుచున్న యెడల నీవు చేయగలిగినది ఎంతో యున్నది. ఇట్టి రకమైన వారికొరకే మేము ఎదురు చూచుచున్నాము. ఇట్టివారే ప్రభువునకు అవుసరమైన వారు.

- జె.పి. ఫోట్.

## ఆయా కాలములలో పాపవిమోచన ఎట్లు లభించెను ?

"మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయపూర్వకముగా లోబడినవారై, పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి; ఇందుకు దేవునికి స్తోత్రము" (రోమా 6:17-18).

### 1. బాప్తిస్మమిచ్చు యోహాను కాలములో

యోహాను వచ్చి పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమైన బాప్తిస్మము పొందవలెనని యోర్దాను నదీ తీరమంతట ప్రకటించుచుండెను (లూకా 3:3-6).

ఆ సమయమున యెరూషలేము వారును యూదయ వారందరును యోర్దాను నదీ ప్రాంతముల వారందరును, అతని యొద్దకు వచ్చి, తమ పాపములను ఒప్పుకొనుచు, యోర్దాను నదిలో అతనిచేత బాప్తిస్మము పొందుచుండిరి (మత్త 3:5,6).

ఇది యోహాను కాలమునాటి పాపవిమోచన పద్ధతి. తమ పాపములు ఒప్పుకొనుచు బాప్తిస్మము పొందుట.

### 2. క్రీస్తు శరీరధారిగా ఉన్న కాలములో

పాపాత్మురాలు అనబడిన స్త్రీ ఎట్లు రక్షింపబడెను? ఆమె విస్తారముగా ప్రేమించెను గనుక ఆమె విస్తార పాపముల క్షమింపబడి ఉన్నవి.. నీ విశ్వాసము నిన్ను రక్షించెను, సమాధానము గలదానవై వెళ్లుము (లూకా 7:47,50) అని యేసు ఆమెతో చెప్పెను.

యేసు వారి విశ్వాసము చూచి కుమారుడా ధైర్యముగా ఉండుమని నీ పాపములు క్షమింపబడి యున్నవని పక్షవాయువు గల వానితో చెప్పెను (మత్తయి 9:2).

అందుకు యేసు-ఇతడును అబ్రహాము కుమారుడే, ఎందుకనగా నేడు ఈ యింటికి రక్షణ వచ్చియున్నది (లూకా 19:9).

యేసు వారి విశ్వాసమును చూచి ఆయన మాట మాత్రము సెలవిచ్చుటతో పాపిని రక్షించేవారు. ఏలయనగా పాపములు క్షమించుటకు భూమి మీద మనుష్యకుమారునికి అధికారము కలదు (మత్తయి 9:6).

ఈ అధికారముతోనే సిలువపైనున్న దొంగను పరదైసుకు తీసుకువెళ్ళెను (లూకా 23:43).

**3. క్రీస్తు పునరుత్థానము తరువాత కాలములో**

క్రీస్తు సిలువలో మరణించి సమాధి చేయబడి, మూడవ దినమున పునరుతానుడైన తరువాత సర్వకాల సర్వదేశ సర్వావస్థలలో సర్వపాపులకు ఒకే విధమగు రక్షణ మార్గమును, ఒకే విధమగు విమోచన క్రమమును ఉపదేశించెను.

ఆ ఉపదేశక్రమముకు హృదయపూర్వకముగా లోబడిన వారు పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులగుదురు.

## క్రీస్తు పునరుత్థానము తరువాత పాపుల పాపవిమోచన కొరకైన ఉపదేశక్రమము :

సువార్త ప్రకటన యను వెర్రితనము చేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను (1కొరింథీ 1:21).

క్రీస్తు సువార్తను నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును నమ్మని వానికి శిక్షి విధింపబడును (మార్కు 16:15-16).

## బాప్తిస్మము అనగా ఏమి ?

బాప్తిస్మము వలన ఏమి జరుగుచున్నది ?

బాప్తిస్మము వలన పాపి క్రీస్తులోనికి వెళ్లుచున్నాడు (గల 3:27). అనగా బాప్తిస్మము క్రీస్తు యొక్క మరణము లోనికి, సమాధిలోనికి, పునరుత్థానములోనికి చేర్చి క్రీస్తుతో ఐక్యము చేయుచున్నది (రోమా 6:3-5).

ఇప్పుడు క్రీస్తుయేసునందున్న వారికి ఏ శిక్షా విధియు లేదు (రోమా 8:1).

ఇంకను ఉపదేశక్రమములో బాప్తిస్మమును గూర్చి ఏమి వ్రాయబడెను ?

బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది. అదేదనగా శరీర మాలిన్యమును తీసివేయుట కాదుగాని యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనసాక్షినిచ్చు ప్రత్యుత్తరమే (1పేతురు 3:21).

బాప్తిస్మములో పాపములు కడుగబడుచున్నవి (అపొ.కా. 22:16).

పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను (అపొ.కా. 2:38).

పాపికి పాపక్షమాపణ నిమిత్తము, సువార్త పరిచారకుడు నీళ్లలో బాప్తిస్మము ఇచ్చును. బాప్తిస్మము ఇచ్చేవాడు తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్క నామములోనికి బాప్తిస్మము ఇయ్యవలెను (మత్త 28:19).

అయితే పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందేవారు క్రీస్తుయేసు లోనికి బాప్తిస్మము పొందవలెను (అపొ.కా. 2:38).

పాపపరిహారము కొరకై బాప్తిస్మము పొందగోరువారి కొరకైన ఉపదేశ క్రమము.

1. వారు క్రీస్తును గూర్చిన రక్షణ సువార్త వినవలెను (ఎఫెసీ 1:13; రోమా 10:17).

2. వినిన సువార్తను నమ్మవలెను (హెబ్రీ 11:6).

3. మారుమనస్సు పొందవలెను (అపో.కా. 2:38).

4. యేసుక్రీస్తు దేవుని కుమారుడు అని విశ్వసించి నోటితో ఒప్పుకొనవలెను (1యోహా 4:15; మత్త 10:32,33; రోమా 10:9-10).

5. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను (నీటిలో ముంచడము పొందవలెను) (అపో.కా. 8:36-39).

ఇదే పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులగుట కొరకు దేవుడు అనుగ్రహించిన ఉపదేశక్రమము.

4. ఈ దినాలలో ఈ గొప్ప రక్షణ సంకల్పము తెలియక మతశాఖల వారి సభలలో రక్షణ పొందగోరువారు తమ పాపములు ఒప్పుకొనవలెననియు రక్షింపబడినాను అను విశ్వాసముతో రక్షణ తీర్మాన పత్రముపై సంతకము చేసి ఇవ్వమనియు చెప్పి వారితో తమ సభలలో సాక్ష్యాలు ఇప్పిస్తున్నారు.

క్రీస్తు సిలువలో వ్రేలాడుచు దర్శనములో కనబడి నా పాపములు క్షమించెనని, స్వరముతో మాట్లాడెనని చెప్పువారున్నారు. అనేకులు ఆలాగు దర్శనములో రక్షింపబడ్డామని మోసపోవుచున్నారు.

ఈలాగు లేఖనములకు వేరుగా కల్పింపబడిన పద్ధతులతో రక్షింపబడ్డామని తమ సంస్థ నాయకులు సభ్యులు కూడా మోసపోవుచున్నారే గాని క్రీస్తు ఉపదేశమును అనుసరించి రక్షణ పొందుటలేదు.

వీరిని గూర్చి లేఖనములలో అక్రమము చేయువారని చెప్పబడియున్నదీ (మత్త 7:22-23; లూకా 13:24-30).

పాపి పాప క్షమాపణ కొరకు తమ పాపములు ఒప్పుకొనవలెనని గాని, పాపినైన నన్ను రక్షింపమని ప్రార్థన చేయవలెనని గాని లేఖనములు చెప్పుటలేదు.

మొదటిగా రక్షింపబడిన మూడు వేలమంది మొదలుకొని ప్రతిదినము రక్షణ పొందుచున్నవారిని గూర్చి లేఖనములను చదువుచున్నాము గాని ఎక్కడా పాపక్షమాపణ కొరకు పాపములు ఒప్పుకొనినట్లు లేదు (అపొ.కా. 8:35-39 చదువండి).

నపుంసకుడు విని విశ్వసించి మారుమనస్సు పొంది యేసుక్రీస్తు దేవుని కుమారుడని హృదయమందు విశ్వసించి నోటితో ఒప్పుకొని బాప్తిస్మము పొందెనని వ్రాయబడెను. తాను ఒప్పుకొనినది క్రీస్తునందలి విశ్వాసమును గాని తన పాపములు కాదు (అపొ.కా. 8:36-39). అయితే 1యోహాను 1:8-10లో పాపములు ఒప్పుకొనవలెనని వ్రాయబడెను గదా అంటారు. అవును అది రక్షింపబడిన సంఘ సభ్యులలో ఎవరైనా పాపము చేసిన యెడల వారు 1యోహా 1:8-10లో ఉన్నట్టు ఒప్పుకొనవలెను.

అలాగే సామె 28:13, యెషయా 59:1-3, లోగల ఒప్పుకోలు దేవుని ప్రజలని పిలువబడుచున్న ఇశ్రాయేలీయుల విషయములో చెప్పబడినదే గాని క్రీస్తు రక్తము వలననైన క్రొత్తనిబంధన రక్షణ మార్గమునకు చెందిన ఉపదేశక్రమము కాదు. గమనించండి :

పాపులు రక్షణ పొందు విధము

ఇశ్రాయేలు కాలములో వేరు

బాప్తిస్మమిచ్చు యోహాను కాలములో వేరు.

క్రీస్తు శరీరధారిగా ఉన్నకాలములో వేరు.

## 24.

## క్రీస్తు మరణ సమాధి పునరుత్థానము తరువాత వేరు,

ఇపుడు మనలను రక్షించుచున్న బాప్తిస్మము క్రీస్తు పునరుత్థానము వలన అయినది (1పేతురు 3:21). గాని మతశాఖల వారు ఈ గొప్ప సత్యమును ఎరుగక కాల విభజనను విశ్వసించక దేవుని వాక్యమును కలిపి చెరిపి బోధించుచు, తమతో పాటు అనేకులను మోసగించి నరకపాత్రులను చేయుచున్నారు (2కొరింథీ 2:17; 2తిమో 2:15).

ఉదా: ఒక ప్రముఖ మతశాఖ నాయకుని జీవితచరిత్రలో తాను రక్షింపబడిన విధమును యిలా వ్రాసిరి. 1933 వ సంవత్సరములో నా పాపములు ఒప్పుకొనుచూ పాపక్షమాపణ కొరకు క్రీస్తుకు ప్రార్థన చేయుచుండగా గొర్రెపిల్ల రక్తముతో నా పాపము కడుగబడినట్లు దర్శనము కలిగినది. ఈలాగు రక్షింపబడిన తరువాత మరొక దర్శనములో క్రీస్తు కనబడి సేవకు పిలిచాడు.

నేను రక్షింపబడిన నాలుగు సంవత్సరములకు అనగా 1937వ సంవత్సరములో నీటి బాప్తిస్మము పొందితిని.

అంతమాత్రమే కాదు వారి బోధలలో-పాపక్షమాపణ కొరకు తమ పాపములు ఒప్పుకొని రక్షింపబడిన వారే బాప్తిస్మము పొందాలని జనములకు బోధించుచు, రక్షణ పొందానని సాక్ష్యము చెప్పిన వారికే బాప్తిస్మమని ముంచుచూ జనములను తమలోనికి చేర్చుకొని క్రీస్తు వాక్యానికి విరోధముగా క్రీస్తు నామమునకు వేరుగా సంఘమును కట్టుచున్నారు. ఈలాగే మతశాఖల వారంతా క్రీస్తు బోధకు వేరుగా, క్రీస్తు ఆజ్ఞలను నిర్లక్ష్యము చేయుచు రక్షణ మార్గాన్ని ప్రకటించు చున్నారు. ప్రతివారు మోసపోకుండునట్లు క్రీస్తు వాక్యాన్ని నమ్మండి !!

పాల్‌గూటం, గొల్లవిల్లి.

బైబిల్ సెమినార్‌లో బేసిక్ బైబిలు కోర్సును పూర్తిచేసిన వారికి యోగ్యతాపత్రములు, బైబిళ్లు సోదరులు రైస్ గారి ద్వారా అందజేయబడెను.

మన పొరుగు రాష్ట్రమునుండి వచ్చినవారికి కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ భవన సముదాయములో మంచి భోజన వసతి సౌకర్యములు కల్పించబడెను. సెమినార్ అంతయు జయప్రదముగాను, క్రీస్తు నామమునకు ఘనత తెచ్చునది గాను జరిగించుటలో సోదరులు నెహెమ్యా గూటం, సోదరి నలినీ గూటం, స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక సంఘస్థులు గొప్పగా సహకరించిరి. ఒరిస్సా వాస్తవ్యులైన జాషువా గారి సతీమణి కవితా గూటం గారి కృషివలన ఒరిస్సాలో క్రీస్తుసంఘ పని బలపడుచున్నందువలన అందరు దేవుని స్తుతించిరి, ఆమెను అభినందించిరి.

ఒరియా సెమినార్‌కు ముందు, దాని తరువాత కూడ సోదరులు రైస్‌గారు, జాషువా గారు పీరా రామచంద్రపురం, కురెళ్ళగూడెం, పల్లంకుర్రు, కొండుకుదురు మొదలగు గ్రామములో యున్న సంఘములను దర్శించి వాక్యపరిచర్య చేయగా 29 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

మార్చి 4వ తేదీనాడు రైస్‌గారు, జాషువా గారు కలిసి కలకత్తా మీదుగా ఖాట్మండు చేరుకొని, నేపాల్ దేశములో అయిదురోజుల మట్టుకు సువార్త ప్రకటించిరి. ముఖ్యముగా ఝాప్తా ప్రాంతములో ఈతాహారి, ఉర్లబారి అను గ్రామాలను దర్శించి అక్కడనున్న క్రైస్తవులను, సంఘాలను బలపర్చిరి. అనేక కష్టముల నెదుర్కొనుచు, సువార్త పరిచర్య గావించుచున్న ఇంచుమించు 20 మంది సువార్తికులను కలసికొని దేవుని పనిలో ముందుకు సాగవలెనని వారిని ప్రోత్సహించిరి. నేపాల్ దేశములో ఈ యిద్దరి సువార్త పర్యటన నిరాటంకముగా జరుగుటకు సోదరులు షేర్ బహదూర్ కార్కి, వారి స్థానిక సంఘము మరియు

శాంతాకుమార్ ఛెత్రి గార్లు సహాయపడిరి. ఆంగ్లమునుండి నేపాలీ భాషకు తర్జుమా చేయుటలో వారిద్దరు పలుచోట్ల జరిగిన కూటములలో సహకరించిరి. నేపాల్ దేశము కూడ విగ్రహారాధనతో నిండియున్నను, సత్యవాక్యమును విని ఇరవైమంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. క్రీస్తును గూర్చి వినుటకు, బైబిలును తెలుసు కొనుటకు అనేకమంది ఆసక్తిని కనుబరచిరి.

మార్చి 10వ తేదీనాడు ఖాట్మండ్ నుండి సోదరులు ఐరా రైస్ గారు సింగపూర్ వెళ్లగా సోదరులు జాషువా గూటం గారు ఢిల్లీ చేరుకొని, అక్కడ మరొక 5 దినములు గడిపి సత్యవాణి రేడియో ప్రసంగములను రికార్డు చేసి కాకినాడకు 15వ తేదీనాడు క్షేమముగా చేరుకొనిరి.


Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada - 533 004.
Editor : Joshua Gootam



RNI Regd. No. 69973/98
PRINTED BOOK - BOOK POST



From:
**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**


To